

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా రామసుబ్బారెడ్డి ఏకగ్రీవం



ధృవపత్రాన్ని అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి సాయికాంత్ వర్మ

కడప : ఉమ్మడి వైఎస్ ఆర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి సాయి కాంత్ వర్మ తెలిపారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన వైసీపీ అభ్యర్థి రామ సుబ్బారెడ్డి పొన్నపురెడ్డికి సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో ,రిటర్నింగ్ అధికారి ధ్రువపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మేయర్ సురేష్ బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందా రెడ్డి పాల్గొన్నారు.

ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- 40 దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న స్మగ్లర్లపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి ఒక అంతర్రాష్ట్ర స్మగ్లర్‌తోపాటు మరో ఐదుగురిని అరెస్టు చేశారని ఎస్‌పి అన్బురాజన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాపురం మండలం తాడిపత్రి- ముద్దనూరు బైపాస్ రోడ్డు పక్కన ఉన్న బుజ్జి చీని, నిమ్మ తోట పక్కన కొంతమంది స్మగ్లర్లు ఎర్రచందన దొంగలను వాహనంలో లోడ్ చేస్తూ ఉండగా టాస్క్ ఫోర్స్ అధికారులు, కొండాపురం పోలీసులు దాడి చేసి పట్టుకున్నారని తెలిపారు. కరుడుగట్టిన అంతర్రాష్ట్ర ఎర్రచందన స్మగ్లర్ భాస్కర్ రెడ్డితో పాటు అతని అనుచరులు ఐదుగురిని అరెస్టు చేశారని, మరో ఐదుగురు స్మగ్లర్లు తప్పించుకున్నారని చెప్పారు. స్మగ్లర్ల నుంచి 40 ఎర్రచందనం దుంగలు, గూడ్స్, స్కార్పియో వాహనం, నాలుగు మోటార్ సైకిల్స్, 7 సెల్ ఫోన్లు, 5 గొడ్డళ్లు, ఒక ఎలక్ట్రానిక్ వెల్డింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. భాస్కర్ రెడ్డిపై 2007 నుంచి సుమారు 10 ఎర్రచందన దొంగతనం కేసులు నమోదయ్యాయని తెలిపారు. పీడీ యాక్ట్ పెట్టండి చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, తుపాకుల ఖాదర్ బాషా, లక్ష్మీనారాయణ రెడ్డి, రాజేంద్ర ఉన్నారని పేర్కొన్నారు. అరెస్టు చేసేందుకు కృషిచేసిన ఫ్యాక్షన్ జోన్ డిఎస్‌పి చెంచుబాబు, జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు, ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, కొండాపురం సిఐ సుదర్శన ప్రసాద్, ఎస్‌ఐ సత్యనారాయణ, ఆర్ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై ఎప్పటికప్పుడూ పోలీసులు. ప్రజలకు సమాచారం అందించాలని కోరారు. **పోలీసుల అదుపులో సైబర్ నేరస్థుడు..** ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో మోసం చేసిన డబ్బులు కాజేస్తున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరస్థుడు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రజత్ సక్సేనాను బద్వేల్ పోలీసులు అరెస్ట్ చేశారని ఎస్‌పి అన్బురాజన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్‌కు చెందిన వ్యక్తి డబ్బు పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న వారి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదనపు ఎస్‌పి తుషార్ డూడి ఆధ్వర్యంలో స్పెషల్ టీ, సైబర్ క్రైమ్ సహకారంతో నిందితుడిని రాజస్థాన్‌లో అరెస్టు చేశారని పేర్కొన్నారు. నిందితుడు నుంచి ల్యాప్‌టాప్, సెల్ ఫోన్లు, 14 బ్యాంక్ డెబిట్ క్రెడిట్ గిఫ్ట్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ స్కామ్ లో పాల్గొన్న మిగిలిన నిందితుల కోసం స్పెషల్ టీమ్‌ను నియమించామని తెలిపారు. ప్రజలు వాట్సప్, టెలిగ్రామ్ యాప్‌ల ద్వారా వచ్చే అనుమానిత లింకులను ఓపెన్ చేసి సైబర్ నేరస్తుల చేతిలో చిక్కుకుని మోసపోవద్దని చెప్పారు. ఇలాంటి మోసాలకు గురైన బాధితులు సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కేసును చేదించడంలో నిరంతరం శ్రమించిన బద్వేల్ సిఐ వెంకటేశ్వర్లు, వెంకటరమణ, ఎస్‌ఐ శ్రీకాంత్, సిబ్బంది రవికుమార్, రఫీ, రమేష్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నాయుడు, సిఐ మధు మల్లేశ్వర రెడ్డిని ఎస్‌పి అభినందించారు. అనంతరం వారి ప్రశంసా పత్రాలు అందజేశారు.



మీడియా ముందు స్మగ్లర్లను హాజరుపరుస్తున్న ఎస్‌పి అన్బురాజన్

గృహ నిర్మాణ లక్ష్యాన్ని అధిగమించాలి

కలెక్టర్ వి.విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - కడప

గృహ నిర్మాణ లక్ష్యాన్ని అధికారులు సాధించాలని, ప్రతి అంశంలోనూ పురోగతి సాధించాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, హౌసింగ్ పీడీ కృష్ణయ్యతో కలిసి గనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు, ఓటీఎస్ ప్రక్రియల యాక్షన్ ప్లాన్‌తో పాటు అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి, సర్వీసు రిక్వెస్టులు- పరిష్కారాలు తదితర అంశాలతో కూడిన ఎజెండాలపై ఆర్డీవోలు, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో నేరుగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి వారమూ ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. ప్రధానంగా జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. లే అవుట్ పూర్తయినవి, పూర్తి కానివీ, గ్రౌండింగ్ స్టార్ట్ అయినవి, మేస్త్రీలతో టై అప్, ఇసుక, ఐరన్, సిమెంట్ మొదలైన మెటీరియల్, ఫైనాన్స్ అసిస్టెంట్స్ మొదలైన అన్ని రకాల సదుపాయాలను సమకూర్చి నిర్మాణ పలనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న గృహనిర్మాణాలలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వక పూర్తి అవగాహనతో లక్ష్యాలను ఆధిగమించాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ ప్రయారిటీ బిల్డింగ్స్‌కు సంబంధించి.. పురోగతిలో వెనకబాటులో ఉన్న, ఇప్పటికీ బేస్ మెంట్ కూడా జరగని గ్రామాలో పంచాయితీరాజ్ శాఖ డీఈలు, ఈఈలు, ఏఈలు ఎంఎస్‌ఓ.లు ఆయా గ్రామాల అక్కడే బస చేసి నిర్మాణ దశలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఉన్నపాత భవనాలను మరమ్మతులు చేయించాలని అన్నారు. మరుగుదొడ్లు, ప్రహరీలను, నీటి వసతి, మౌలిక సదుపాయాలను వేగవంతం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో బద్వేలు, పులివెందుల ఆర్‌డిఓలు వెంకట రమణ, వెంకటేష్, వివిధ శాఖల అధికారులైన నియోజకవర్గ, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

నేడు డాక్టర్ 'జానమద్ది' వర్ధంతి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈనెల 28న ఉదయం 10 గంటలకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో గ్రంథాలయ వ్యవస్థాపకులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి నవమ వర్ధంతి, స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసి ఆచార్య రంగ జనార్దన, సభాధ్యక్షులుగా యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్టర్ ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య, ప్రధాన వక్తగా పంచసహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ (తిరుపతి), విశిష్ట అతిథులుగా శ్రీ అచలానంద ఆశ్రమం పీఠాధిపతులు స్వామి విరజానంద (బ్రహ్మంగారి మఠం), యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీనివాస్, పూర్వ శాసనమండలి సభ్యులు పోచంరెడ్డి సుబ్బారెడ్డి, జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ పాల్గొంటారన్నారు. జానమద్ది వారి ఆత్మీయులు, సి.పి.బ్రౌన్ మెమోరియల్ ట్రస్ట్ పూర్వ సంయుక్త కార్యదర్శి ఎం.జానకిరామ్, జానమద్ది వారి సన్నిహితులు, సాహితీవేత్త ఎస్.ఈశ్వరరెడ్డి (బ్రహ్మంగారి మఠం) ఆత్మీయ సత్కారం అందుకుంటారని తెలిపారు.

పైపులైన్‌కు మరమ్మతులు

పోరుమామిళ్ళ టౌన్ : ప్రధాన రహదారిపై నీటి పైపులైన్ దెబ్బతినడంతో స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ సోమవారం దగ్గరుండి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్ దెబ్బతిన్న విషయాన్ని స్థానికులు తనకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో వెంటనే మరమ్మతులు చేయించానని చెప్పారు. పంచాయతీలో ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించేందుకు ముందుంటానని తెలిపారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసిన గెలిపించిన ప్రజానీకానికి తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. భవిష్యత్‌లోనూ ఇదే ఒరవడి కొనసాగిస్తానని పేర్కొన్నారు.

ప్రజా ఫిర్యాదులు స్వీకరణ

కడప : ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన 'స్పందన' కార్యక్రమం ద్వారా సోమవారం అధికారులు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమానికి డిఆర్‌ఓ గంగాధర్ గౌడ్, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు యదుభూషన్ రెడ్డి, ఆనంద్ నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ఉద్యమాభివృద్ధికి విరాళాలు ఇవ్వండి : సిపిఎం

ప్రజాశక్తి-కలసపాడు

ప్రజా ఉద్యమాభివృద్ధి విరాళాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి. అన్వేష్ ఆధ్వర్యంలో నాయకులు గురయ్య, వీరయ్య ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వరు మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అందరూ పోరాడాల్సిన అవసమెంతైనా ఉందని చెప్పారు. ప్రజలపై మోయరాని భారాలు మోపుతున్నాయని, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, నిరుద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా అందరం కలిసి కట్టుగా డిమాండ్లను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఎం బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరమూ పోరాటాలు చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సంఘం కార్మిక నాయకులు వీరభద్రయ్య, సుదర్శన్, శేఖర్, రాజు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి- వల్లూరు

గ్రామానికి చెందిన హిందూ శ్మశాన వాటికను కొందరు గ్రామానికి చెందిన వ్యక్తులు ఆక్రమించారని సోమవారం తహశీల్దార్ జి.అమరేశ్వరికి స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా ఇటీవల గ్రామంలో ఒక మహిళ మృతిచెందగా మృతి దేహాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్తే కొందరు అడ్డుకున్నారని స్థానిక ఫిర్యాదుదారులు తెలిపారు. అప్పుడే హిందూ శ్మశాన వాటిక భూ అక్రమ కు గురైందని స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు విన్నవించామని చెప్పారు. తహశీల్దార్ స్పందిస్తూ విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి -కడప అర్బన్

కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌లో 1000 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఇందులో 354 మంది ఇంజినీరింగ్ కార్మికులున్నారని పేర్కొన్నారు. నీటి పని చేసే కార్మికులకు నీళ్ల వదలమే కాకుండా, పన్నులు కూడా వసూలు చేయాలని చెప్పడం సమంజసం కాదన్నారు. దీనివల్ల పని భారం అధికమైందని తెలిపారు. కార్మికులకు రైన్ కోట్, రక్షణ పరికరాలు అందించాలని చెప్పారు. జీవో నంబర్ 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. తెల్లవారుజామున సమావేశం రద్దుచేసి విధులకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి గోపి, నవర ప్రధాన కార్యదర్శి కేశవ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మనోహర్

'ఏ రాజకీయ పార్టీకీ గులాంగిరి చేయం'



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సంఘసేవకులు సలావుద్దీన్

ప్రజాశక్తి -కడప అర్బన్

ముస్లిం మైనార్టీలు ఏ రాజకీయ పార్టీలకు గులాం గిరి చేయరని, 2024 ఎన్నికల్లో ఓట్లు మావే, సీట్లు మావే అనే నినాదంతో ముందుకు వెళ్తామని ఆంధ్రప్రదేశ్ ముస్లిం ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం మచిలీపట్నంలో ముస్లిం ఐక్యవేదిక నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 90 నియోజకవర్గ వర్గాల్లో గెలుపోటములు ప్రభావితం చేసే సత్తా ముస్లిములకు ఉందని చెప్పారు. అలాంటప్పుడు మన ఓట్లు మనవారికి వేస్తే దాదాపు 35 నియోజకవర్గాల్లో ముస్లిములు గెలుస్తారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అన్ని రాజకీయ పార్టీలు ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన తర్వాత విస్మరించడం శోచనీయమన్నారు. రాజ్యాధికారంతోనే ముస్లిములు అభివృద్ధి చెందుతారని తెలిపారు. దీనికోసం యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి పట్టణంలో పర్యటించి ముస్లిములను చైతన్య పరుస్తామని పేర్కొన్నారు. అనంతరం ముస్లిం ఐక్యవేదిక మచిలీపట్నం కమిటీ చే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జియావుల్ రెహమాన్, రాష్ట్ర అధ్యక్షులు జాఫర్ అలీ, అధికార ప్రతినిధి సయ్యద్ ఖలీల్, అబ్దుల్ కలాం, సయ్యద్ నూర్, షేక్ బాజీ, షేక్ సలీం పాల్గొన్నారు.

పూర్వ ఉపాధ్యాయుల చేయూత

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

మండలంలోని గానుగపెంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు స్థలం కోసం రూ. 40 వేలను ఆర్థిక సాయం చేశారు. సోమవారం దాతలు విరాళాలు ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి. రమణారెడ్డికి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్లుగా గానుగపెంట ఉన్నత పాఠశాలకు క్రీడామైదానం, చుట్టూ ప్రహరీ లేకపోవడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు అసౌకర్యానికి గురయ్యే వారని చెప్పారు. ప్రభుత్వం నాడు నేడు కింద నూతన తరగతి గదులు మంజూరు చేసినా అందుకు సంబంధించి స్థల సేకరణ పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషాద్రి చొరవ తీసుకుని గ్రామస్తుల సహకారంతో స్థల యాజమానితో చర్చించి కొంత స్థలాన్ని సేకరించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారని చెప్పారు. అందుకు అవసరమైన మొత్తాన్ని పూర్వ ఉపాధ్యాయులు అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు క్రిష్ణారెడ్డి, నరసింహారెడ్డి, పుల్లారెడ్డి, గోవిందు, మహానంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్చి 2న ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కడప

నిరుద్యోగ యువతీ యువకులకు పరిశ్రమ ఆధారిత శిక్షణ, అవకాశాల ద్వారా శ్రీ సిటీ లోని ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాల కోసం మార్చి 2న పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లమో అన్ని గ్రూపులు(సివిల్, అగ్రికల్చర్ కాకుండా) 2018 నుండి 2022 సంవత్సరంలో పాసై 18 నుండి 26 ఏళ్ల లోపు వయస్సు కలిగిన యువతీ యువకులు ఇంటర్వ్యూలలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 6300125455, 7892933270లలో సంప్రదించాలన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

ప్రజాశక్తి- కడప అర్బన్

నగర శివారులోని ఎర్ర మాసపల్లి, కొప్పర్తి (శివాజీ నగర్) లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న విద్యార్థులకు కెఎస్‌ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి క్రీడల సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు పిల్లల మానసిక ఒత్తిడిని తగ్గించడమేగాక వికాసానికి ఎంతో తోడ్పాటునిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కొప్పర్తి గ్రామం అసిస్టెంట్ ఇంజినీర్ జగదీశ్వర్ రెడ్డి, ఇరిగేషన్ డిపార్ట్మెంట్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ జి. సునీల్ కుమార్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి. నారాయణ పాల్గొన్నారు.

'జీవితం ఎంతో విలువైంది'

ప్రజాశక్తి -కడప అర్బన్

ప్రణాళిక బద్ధమైన, క్రమశిక్షణతో కూడిన జీవితం ఉజ్వలంగా ఉంటుందని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం యోగి వేమన విశ్వవిద్యాలయం మనోవిజ్ఞాన శాస్త్ర శాఖ, స్పందన ఈడా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'జీవితం అమూల్యమైంది- విలువ ఇవ్వండి' అనే అంశంపై అవగాహన కార్యక్రమం సర్ సివి రామన్ సైన్స్ బ్లాక్‌లోని సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అసహజ మరణాలు చాలా జరుగుతున్నాయని తెలిపారు. వాటికి ప్రధానంగా వయస్సు ప్రభావం, మంచి, చెడు విచక్షణ చేయలేకపోవడం, తల్లిదండ్రుల అతిగారాభం, ఇతరుల మాటలకు ప్రాధాన్యత ఇవ్వటం వంటి అంశాలుగా వివరించారు. ప్రతి విద్యార్థీ వారి భవిష్యత్తును ఎలా నిర్మించుకోవాలో ఇలాంటి కార్యక్రమాల ద్వారా అవగాహన పొందవచ్చన్నారు. స్పందన ఈడా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయవంతం మాట్లాడుతూ జీవితంలోని ఒడిదుడుకులను తట్టుకొని ఎలా ముందుకు సాగాలో వివరిస్తూ విద్యార్థుల్లో ప్రేరణ నింపారు. సైకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ కె. లలిత కో-కన్వీనర్ సైకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి. లాజర్ మాట్లాడుతూ జీవిత విలువల గురించి వక్తలు మాట్లాడిన అంశాలు విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సహ ఆచార్యులు డాక్టర్ సరిత, డాక్టర్ సునీత, సైకాలజీ అధ్యాపకులు రవీంద్ర, లక్ష్మనరసింహ అశ్వర్థ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

వరంగల్ జిల్లా కాకతీయ మెడికల్ కళాశాలలో పీజీ అనస్తీషియా మొదటి సంవత్సరం చదువుతున్న ప్రీతి సీనియర్ విద్యార్థి సైఫ్ చేసిన ర్యాగింగ్ భూతానికి బలై పోయిందని, అతన్ని కఠినంగా శిక్షించాలని పిడియస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, పిడియస్ యు జిల్లా కార్యదర్శి ఓ.నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. నగరంలోని ఐటిఐ ప్రాంతంలో ప్రీతి మృతి పట్ల కొవ్వొత్తులతో సాయంత్రం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో సీనియర్లు చేస్తున్న ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వల్ల జూనియర్ విద్యార్థులు బలై పోతున్నారని, కళాశాలల్లో ర్యాగింగ్ వ్యతిరేక కమిటీలున్నా అవి నిష్ప్రయోజనంగానే ఉన్నాయని అన్నారు. సీనియర్ మెడికో సైఫ్ చేసిన ర్యాగింగ్ వేధింపులకు తట్టుకోలేక ప్రీతి విషపు ఇంజక్షన్ చేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని వాపోయారు. 5రోజుల పాటు మృత్యువుతో పోరాడి మరణించిందని అన్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ లను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని విమర్శించారు. ర్యాగింగ్‌కు బలైన ప్రీతి, రక్షిత కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పిడియస్‌యు నగర నాయకులు సుభాషిని, సల్మా, వాసంతి, అనురాధ, రాజేశ్వరి పాల్గొన్నారు.

'ఆకాశం ఎందుకు నీలంగా ఉంటుంది'

ప్రజాశక్తి - కడప అర్బన్

జన విజ్ఞాన వేదిక, కడప జిల్లా కమిటీ జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సర్. సి.వి. రామన్ రచించిన 'ఆకాశం ఎందుకు నీలంగా ఉంటుంది' తెలుగులో ఎం. వి. చలపతి అనువాదం చేసిన పుస్తకాన్ని సోమవారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్, సైన్స్ ఫ్యాకల్టీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొట్టమొదటి నోబెల్ బహుమతి పొందిన మొదటి భారతీయుడు సర్ సి.వి. రామన్ అని అన్నారు. యూరప్‌కు నౌకలో వెళ్లేటప్పుడు సముద్రం, మంచుకొండలు, ఆకాశం ఎందుకు నీలంగా ఉన్నాయని తనకు తాను ప్రశ్నించుకున్నారు. దానిమీద పరిశోధనలు చేశారు. ఆకాశం నీలంగా ఉండటానికి కాంతి పరిక్షేపణం కారణం అని కనుగొన్నారు. దీన్నే 'రామన్ ఫలితం' అంటారు. దీనికి 1930లో నోబెల్ బహుమతిని ప్రకటించారు. సముద్రపు నీలిరంగు కారణం సూర్యకాంతి నీటి అణువులు విక్షేపం చెందించాయని, కాంతి ఏడు రంగుల్లో నీలం రంగు ఎక్కువ విక్షేపం చెందుతుందని, అందుకే సముద్రం నీలం గా కనబడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిటీ ఉపాధ్యక్షులు రాయల్ కరిముల్లా ,ఆర్ట్స్ కాలేజీ ప్రొఫెసర్లు బయ్యపరెడ్డి, సుధాకర్ రెడ్డి, ఆదినారాయణ, భూషణం రెడ్డి, రాజేశ్వరి, వెంకట లక్ష్మి, రాజశేఖర్ రెడ్డి, రాజశేఖర్, శ్రీనిత, వీర నాగేంద్ర కుమార్, కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెవికె సమన్వయ కర్త డాక్టర్ వీరయ్య

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

సేంద్రియ వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ పరిశోధన స్థాన అధిపతి శ్రీనివాసాచారి, సమన్వయ కర్త డాక్టర్ వీరయ్య తెలిపారు. సోమవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధానమంత్రి కిషన్ సమ్మాన్ నిధి 13వ విడత ప్రత్యక్ష విక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ చిరుధాన్యాలతో అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందచ్చని వారు సూచించారు. భారత ప్రభుత్వం 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. చిరుధాన్యాలతో అధిక లాభాలతో పాటు ఆరోగ్యం కూడా మెరుగు పరచుకోవచ్చని వారు తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, శాస్త్రవేత్తలు, సాయి మహేశ్వరి, శిల్పకళ, మహేష్‌బాబు, ప్రశాంతి, మానస పాల్గొన్నారు.

పన్ను వసూళ్ల తీరు మారాలని వినతి

ప్రజాశక్తి - కడపఅర్బన్

కార్పొరేషన్‌లో పన్ను వసూళ్ల తీరు మారాలంటూ కమిషనర్‌కు అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ల విజ్ఞప్తి చేశారు. సోమవారం స్పందనలు కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్‌కు పన్ను వసూలు చేసే అధికారుల తీరును వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పాకా సురేష్ మాట్లాడుతూ పన్నుల వసూలకు అనుసరిస్తున్న విధానం వల్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ పన్నుల వసూళ్ల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఇది కార్పొరేటర్ల తిరుగుబాటు, ప్రభుత్వంపై వ్యతిరేకత కాదంటూనే మునిసిపల్ అధికారుల తీరు సరిగా లేదని ఆరోపించారు. ఇదే వినతిని డిప్యూటీ సిఎం, మేయర్, ఎమ్మెల్యే, ఎంపీకి, సిఎంకు ఇస్తామన్నారు. చెత్త పన్ను, ట్రేడ్ లైసెన్సు, ఇంప్రూవ్ మెంట్ టాక్స్, హౌస్ టాక్స్ విషయంలో ఇబ్బందులు ఉన్నాయని స్పష్టం చేశారు. కార్పొరేటర్లతో చర్చించాక కార్పొరేషన్ పరిధిలో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వచ్చే మునిసిపల్ సమావేశాలలో పన్నుల సరళీకరణ పై చర్చకు పెట్టాలన్నారు.

మహిళా క్రికెట్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ మహిళా క్రికెటర్ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సోమవారం జడ్‌పి హైస్కూల్ జయనగర్ ఫిజికల్ డైరెక్టర్ వెంకటసుబ్బమ్మ, మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ వెంకటలక్ష్మి, వారి విద్యార్థులు 70 మంది కడపలోని వై.ఎస్. రాజారెడ్డి ఎసి స్టేడియంలో శిక్షణ తీసుకున్నారు. వారికి కె. విష్ణుమోహన్‌రావు, ఉమెన్ కో-ఆర్డినేటర్ పి విజయ్‌కుమార్, క్రికెటర్ సంఘం సభ్యులు మాజీ ఐపీఎల్ ప్లేయర్ విచ్చేసి బాలికల ఆట పట్ల అవగాహన కల్పిస్తూ తగు సూచనలు చేశారు. వచ్చిన రెండు పాఠశాల నుంచి దాదాపు 32 మందిని ఎంపిక చేశారు. తగు శిక్షణ ఇచ్చి లీగ్ మ్యాచ్‌లు ఏర్పాటు చేసి తుది జట్టుని నిర్ణయిస్తారు.



శిక్షణలో భాగంగా మెలకువలు తెలియజేస్తున్న విష్ణు మోహన్‌రావు


వినతిపత్రం సమర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

రాయల్టీ వసూలు ప్రభుత్వమే చేపట్టాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని నాపరాయి పరిశ్రమ యజమానుల రాయల్టీ వసూలు ప్రభుత్వమే చేపట్టాలని నాపరాయి పరిశ్రమ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం హిల్ ఫైడ్ వ్యూ ఎల్ఎల్‌పి అనే ప్రయివేట్ సంస్థకు రాయల్టీ వసూలు టెండర్ ద్వారా అప్పగించిందన్నారు. ఆ సంస్థ ఈ నెల 24 నుండి రాయల్టీ వసూలు కూడా ప్రారంభించిందన్నారు. ఈ సంస్థ ప్రతినిధులు నాపరాయికి సంబంధించిన లారీలను, ట్రాక్టర్లను ఆపి, పెనాల్టీలను వసూలు చేయడంతో స్థానిక మైనింగ్ కార్యాలయాలకు అప్పజెబుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో నాపరాయి వ్యర్థాలను తరలించే ట్రాక్టర్లను, గృహ నిర్మాణాలకు వాడుకున్న కట్టుడు రాళ్లను తరలించే ట్రాక్టర్లను ఆపి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తుపాకుల పవన్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, బలరామిరెడ్డి పాల్గొన్నారు.

ఇకెవైసి నమోదుకు చివరి గడువు నేడు

ప్రజాశక్తి - ఖాజీపేట

రైతులు ఇకెవైసి నమోదుకు మంగళవారం చివరిరోజని ఎఒ నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇంకా ఇకెవైసి చేయించుకోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ప్రభుత్వపరంగా అందాల్సిన ప్రయోజనాలు ఇకెవైసి నమోదుతో సాధ్యమని తెలిపారు.

ముద్దనూరు : రబీలో సాగు చేసిన పంటలను మంగళవారంలోపు పంట నమోదు, ఇకెవైసి పూర్తి చేసుకోవాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా 2,310 మంది రైతులు 6,160 ఎకరాల్లో రబీలో 36 రకాల పంటలు సాగు చేశారన్నారు. ఇప్పటి వరకు 2,150 మంది రైతులకు సంబంధించిన 5,795 ఎకరాలకు ఇకెవైసి పూర్తయిందన్నారు. ఇంకా 160 మంది రైతులకు గాను 365 ఎకరాల్లో ఇకెవైసి పెండింగ్‌లో ఉందన్నారు. అది కూడా కొండంపల్లి, బొందలకుంట, దేవులపల్లె, నల్లబల్లి, చింతకుంట, వేల్పుచెర్ల గ్రామాల్లో ఇకెవైసి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా ఇకెవైసి, పంట నమోదు చేయించుకోవాలని కోరారు.

నేడు నారాయణ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పాత గండి రోడ్డులో ఉన్న నారాయణ పాఠశాలలో మంగళవారం సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్‌తోపాటు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథులుగా తెలుగు భాషా సంఘం మాజీ అధ్యక్షులు మండలి బుద్ధ ప్రసాద్, పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి, ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రారెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, మాజీ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ సతీష్ కుమార్‌రెడ్డి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి, ఎంఇఒ వీరారెడ్డితోపాటు పలువురు హాజరవుతున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

దళారీ ప్రమేయం లేకుండా విక్రయించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

శనగ కొనుగోలు కేంద్రంలో దళారుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా విక్రయించాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు ఐరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి సూచించారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో సోమవారం ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న బుడ్డ శనగ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం శనగకు రూ.5,335 మద్దతు ధర ప్రకటించిందన్నారు. మధ్యవర్తులు లేకుండా రైతులు నేరుగా ప్రభుత్వానికి అమ్మి, తమ ఖాతాలో నగదును వేయించుకోవాలని బ్యాంకు పుస్తకాలు ఇవ్వాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రంలో శనగలు సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఓబులేసు, ఏఎఒ మాధవరెడ్డి, జమ్మలమడుగు, పెద్దముడియం రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రంలో శనగలను పరిశీలిస్తున్న తిరుపాల్‌రెడ్డి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

లారీ, మోటర్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో కమల్ (28) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కడప-రాయచోటి రోడ్డు ప్రధాన రహదారిలో కొత్త రోడ్డు వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మోటర్ సైకిల్‌పై వెళుతున్న పెద్ద కాంపల్లెకు చెందిన కమల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి ఎస్ఐ చేరుకొని మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆస్తి కోసం మహిళకు బెదిరింపు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో ఆస్తి కొసం మహిళను బెదిరించిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. చియ్యపాడు గ్రామానికి చెందిన పి.ఓబులేసును, అతని తల్లి ఓబులమ్మను భార్య సావిత్రి శారీరకంగా, మానసికంగా హింసిస్తోందని గతంలో కేసు నమోదైంది. అనంతరం ఓబులేస్, సావిత్రి విడాకులు తీసుకున్నారు. అయితే తన అమ్మ ఓములమ్మ పేరున ఉన్న 2 ఎకరాల పొలం రాసివ్వమని కొంత కాలంగా సావిత్రి వేధిస్తున్నట్లు ఓబులేస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన తల్లి ఓబులమ్మకు పక్షవాతం రావడంతో మంచానికి పరిమితమైంది. ఇలాంటి కారణాల వల్ల పి.ఓబులేసు తన భార్యకు విడాకులిచ్చాడు. సావిత్రి తనకు సంబంధించిన వస్తువులన్నీ తీసికెళ్లింది. సావిత్రి తన సోదరులైన సుబ్బయ్య, సురేష్, సూర్య, అక్క కొడుకైన సోము సతీష్‌ను తన ఇంటిమీదకు పంపి పక్షావాతంతో బాధపడుతున్న ఓబులమ్మను దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేశారని ఫిర్యాదు చేశారు. భూమి రాసివ్వకపోతే నీ కొడుకును, మనవడ్ని చంపుతామని బెదిరించినట్లు చాపాడు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

అందిన సమాచారం మేరకు స్థానిక నగర పంచాయతీ పరిధిలోని వై జంక్షన్ వద్ద 18 ఫుల్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని, మంగలి రమేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అతని వద్దనున్న మద్యం బాటిళ్లు హర్యానా రాష్ట్రానికి చెందినవిగా గుర్తించామన్నారు. రమేష్ ధూపనకుడి గ్రామం, ఉయ్యాలవాడ మండలం, కర్నూలు జిల్లా వాసిగా గుర్తించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యర్థాలతో నిండిన పంట కాలువలు


ఖాదర్‌పల్లిలో పంట కాలువలో పేరుకుపోయిన మురుగునీరు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఖాదర్‌పల్లి గ్రామంలో ఉన్న కెసి కెనాల్ కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. ఇళ్ల అవసరాలకు వినియోగించిన వ్యర్థ నీరు అనుసంధానం చేయడం వల్ల కాలువ పూర్తిగా పూడిపోయింది. ఈ నేపథ్యంలో కెసి నీరు కాలువలో ప్రవహించే అవకాశంలేదు. ప్రస్తుతం కెసి కాలువకు మార్చిలో నీరు నిలిచిపోయిన తర్వాత డ్రయినేజీని తొలగించి, పూడికతీత చేపడితే రానున్న ఖరీఫ్‌లోనైనా రైతులకు నీరందుతుంది. కెసి కాలువ లైనింగ్ ఏర్పాటు చేసిన కాలువ పూర్తిగా గ్రామం మధ్యలో ఉండడంతో ప్రజలు ఇష్టానుసారంగా డ్రయినేజీని అనుసంధానం చేశారు. దీంతో పూడికతీత పనులకు ఉపాధి కూలీలు వచ్చేందుకు అయిష్టత చూపుతున్నారు. కొన్నేళ్లుగా పూడికతీత పనులు కూడా చేపట్టలేదు. పంచాయతీ సిబ్బంది గృహ అవసరాలకు వినియోగించిన నీటిని కాలువలోకి రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మురుగు నీరు కాలువలోకి రాకుండా చేసి, అనంతరం పూడికతీత చేపడితే పంట కాలువ ఉపయోగంలోకి వస్తుందని పలువురు సూచిస్తున్నారు.

అస్తవ్యస్తంగా కెసి కాలువలు

ఖాజీపేట : మండలంలోని రైతులకు ప్రధాన నీటి వనరు కెసి కాలువ. కెసి కాలువల కింద ప్రతి ఏడాది పంటలను విరివిగా సాగు చేస్తుంటారు. ఖాజీపేట మండల ప్రాంత రైతులు ముఖ్యంగా వరిని సాగు చేస్తుంటారు. కెసి ఆయకట్టు ప్రధాన కలువ కొండపేట ఉపకాల్వ పరిధిలోని ఒకటో నెంబర్ కాలువ పెద్ద ఎత్తున ఆక్రమణ గురైంది. కాలువ వెంబడి వ్యర్థాలు పెద్ద ఎత్తున చేరడంతో నీటి ప్రవాహానికి అడ్డుగా మారాయి. మరికొన్ని చోట్ల కాలువలు ఆక్రమణ గురయ్యాయి. కాలువల వెంబడి నివాసాలు, దుకాణాలు ఏర్పాట్లు చేసుకున్నారు. అంతేకాకుండా కాలు వెంబడి కంప చెట్లు విపరీతంగా పెరిగాయి. దీంతో కాలువలో నీటి ప్రవాహానికి అటంకం కలిగింది. వీటిపై నీటిపారుదల శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాలువలను ధ్వంసం చేస్తున్నా పట్టించుకోవడంలేదని పెద్ద ఎత్తున విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలపై పర్యవేక్షణ ఉంచి మరమ్మతులపై దృష్టి పెట్టాలని, ఆక్రమణకు గురైన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


ఖాజీపేట : వ్యర్థాలతో నిండి ఉన్న 1వ కెసి ఉప కాలువ

లింగనిర్ధారణ, భ్రూణహత్యలు చట్టరీత్యా నేరం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -పులివెందుల టౌన్

లింగనిర్ధారణ, భ్రూణహత్యలు చట్టరీత్యా నేరమని, అందుకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, డిఎస్‌పి శ్రీనివాసులు హెచ్చరించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ఐసిడిఎస్, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతి లేకుండా గర్భస్రావానికి సంబంధించిన మందులు విక్రయించే మెడికల్ స్టోర్‌లను, గర్భస్రావం చేస్తున్న వ్యక్తులను గుర్తించి కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఆడపిల్లల శాతం పెంచేందుకు అన్ని శాఖల అధికారులు, పోలీసు శాఖ, ఐసిడిఎస్, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డెమో రమణమ్మ, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సుధాకర్, ఐసిడిఎస్ సిడిపిఒ శ్రీలత, డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ దివ్యశ్రీ, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ జీవన్, డాక్టర్ లోకేష్, సీనియర్ అసిస్టెంట్ నరేష్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి హేమలత పాల్గొన్నారు.

వేంపల్లెలో కొనసాగుతున్న వాహనాల కాల్చివేత

- సిసి కెమెరా పుటేజీతో చిక్కిన ఆగంతుకుడు

ప్రజాశక్తి - వేంపల్లె


పాక్షికంగా కాలిన కారు

వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో రెండు నెలలుగా ఏదోకచోట వాహనాలకు నిప్పు పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వాహనాదారులు, పోలీసులకు అంతు చిక్కడంలేదు. తాజాగా సోమవారం తెల్లవారు జామున కన్యకాపరమేశ్వరి దేవస్థానికి చెందిన అమ్మవారిశాల సమీపంలో అదే వీధికి చెందిన దొంతు సంతోష్ అనే వ్యక్తి షిఫ్ట్ డిజైనర్ కారు పార్కింగ్ చేశారు. జనసంచారం లేక పోవడంతో వాహనాలకు నిప్పు పెట్టే ఆగంతుకుడు పెట్రోలు కారుపై వేసి అగ్గిపుల్లతో అంటించాడు. మంటలు ఎగిసి పడడంతో అంతలోనే బయటికి వచ్చిన కారు యజమాని ఇతరుల సాయంతో మంటలను ఆర్పారు. కారు పాక్షికంగా కాలిపోయింది. విషయం తెలిసిన వెంటనే సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ తమ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. అమ్మవారిశాలలో ఉన్న సిసి కెమెరాలను పరిశీలించారు. కారుకు నిప్పు పెట్టే దృశ్యాలు బయటపడ్డాయి. అమ్మవారిశాల సమీపంలోని జెండామాను వీధిలో నివాసం ఉంటున్న ఆగంతుకుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత రెండు నెలలుగా మూడు కార్లు, 6 ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టాడు. నిప్పుకు గురైన వాహనాలన్ని కూడా ఈ ప్రదేశానికి చెందినవే కావడంతో ప్రస్తుతం అదుపులోకి తీసుకున్న ఆగంతుకుడే నిప్పు పెట్టి ఉంటాడని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఆగంతుకుడికి మానసిక పరిస్థితి సరిగా లేనట్లు కనిపిస్తోంది. అనుమానంతో గతంలో కూడా మానసిక పరిస్థితి సరిగా లేని వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసులు ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ వాహనాలకు నిప్పు పెట్టే ఆగడాలు మాత్రం ఆగడంలేదు. ఏదేమైనా స్థానికుల్లో భయాందోళనలు నెలకొని ఉన్నాయి.

మతిస్థిమితం లేక వాహనాలకు నిప్పు : సిఐ


విలేకరులతో మాట్లాడుతున్న సిఐ వెంకటేశ్వర్లు

వేంపల్లెలోని పాత జెండా మాను వీధిలో నివాసం ఉంటున్న సిద్ధిఖ్ అబిద్ అనే మతిస్థిమితం లేని వ్యక్తి వాహనాలకు నిప్పు పెట్టినట్లు సిసి కెమెరాల ద్వారా తెలిసిందని సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనవరి 14 నుండి వాహనాలకు నిప్పు పెట్టారన్నారు. అయితే అప్పట్లో మరో మతిస్థిమితం లేని వ్యక్తి కూడా ఆ ప్రాంతాల్లో వాహనాలు కాలే సమయంలో ఉండడంతో అనుమానాస్పదంగా అదుపులోకి తీసుకొని అధికారుల ఆదేశాల మేరకు వైద్య చికిత్సలు కోసం విశాఖ ఆస్పత్రికి తరలించామన్నారు. సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న సంఘటనపై సిద్ధిఖ్ అబిద్‌ను విచారించగా వాహనాలకు నిప్పు పెట్టింది తానేనని చెప్పాడన్నారు. సిద్ధిఖ్ అబిద్ గతంలో గల్ఫ్ దేశాలకు కూడా వెళ్లినట్లు చెప్పారు. బంగారు పని చేసే అబిద్ కుటుంబ సమస్యలతో మానసికంగా కుంగి ఆరేళ్ల నుండి మతిస్థిమితం లేక తిరుగుతూ పంట పొలాల్లో నిద్రపోయేవాడని విచారణలో తెలిసిందని సిఐ తెలిపారు. కోర్టు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మతిస్థిమితం సరిగాలేని అబిద్‌ను విశాఖలోని ఆసుపత్రికి చికిత్స కోసం పంపిస్తామని ఆయన వివరించారు.

అధ్వానం.. జడ్జిగారికొట్టాలు-సిద్ధారెడ్డిపల్లి రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని జడ్జిగారికొట్టాలు నుండి సిద్ధారెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే దారి చాలా అధ్వానంగా ఉంది. కడప-కర్నూలు ప్రధాన రహదారి నుండి జడ్జిగారికొట్టాలు వద్ద నుంచి సిద్ధారెడ్డిపల్లి గ్రామానికి గ్రావెల్ రోడ్డు వేశారు. ఈ రోడ్డు కొంతకాలంగా మరమ్మతులకు నోచుకోలేదు. గుంతలు, కంకర బయట పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కొన్నేళ్లుగా ఈ రోడ్డును బాగు చేయాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ.3 కోట్లతో టెండర్లు కూడా పిలిచారు. అయితే కాంట్రాక్టరు పనులు ప్రారంభించలేదు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తోంది. ఈ మార్గంగుండా సిద్ధారెడ్డిపల్లి, సోమాపురం, మొద్రాయపల్లె తదితర గ్రామ ప్రజలు మైదుకూరు, దువ్వూరు, చింతకుంట ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ద్వారకా నగరం గ్రామ ప్రజలు సచివాలయం, ఇతర అవసరాల కోసం సిద్ధారెడ్డిపల్లి పంచాయతీలోకి రావాల్సిన ఉంది. ఇప్పటికైనా ఈ మార్గాన్ని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు



ఫ్యాక్షన్‌కు ప్రజలు దూరంగా ఉండాలి

వేంపల్లె : గ్రామీణా ప్రాంతాల్లో ప్రజలు ఫ్యాక్షన్‌కు దూరంగా ఉంటూ సుఖంగా జీవించాలని సిఐ వెంకటేశ్వర్లు కోరారు. టి.వెలమవారిపల్లెలో సోమ వారం నరసరామ్ ఆధ్వర్యంలో పోలీసు కళాజాతా నిర్వహించారు. సైబర్ క్రైమ్, ఫ్యాక్షన్‌పై వివరించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, కళాకారులు పాల్గొన్నారు.

పాదయాత్రలో ఎన్ఆర్ఐ కువైట్ ప్రతినిధి


లోకేష్‌ను కలిసిన అబ్దుల్ కరీం

ప్రజాశక్తి - చాపాడు

టిడిపి యువ నాయకులు నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రకు మద్దతుగా మండల పరిధిలోని ఖాధర్‌పల్లె గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ టిడిపి కువైట్ హవల్లి గవర్నరేట్ మైనారిటీ విభాగం కో-ఆర్డినేటర్ టి.అబ్దుల్ కరీమ్ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ కరీం మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం నారా లోకేష్ పాదయాత్ర చేపట్టారన్నారు. అన్ని వర్గాల ప్రజల నుంచి టిడిపికి ఆదరణ లభిస్తోందన్నారు. వైఎస్ జగన్ పాలనతో ప్రజలు విసుగు చెందుతున్నారన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి (ఆంగ్ల మాధ్యమం) ఐదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లో చేరుటకు బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తునఆనమని కళాశాల ప్రిన్సిపల్ సి.పరిమళ తెలిపారు. విద్యార్థులు ఈనెల 25వ తేదీ నుండి మార్చి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశ పరీక్షలు ఐదో తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 23న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ విద్యార్థినులకు అదేరోజు మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 4.30గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు.

ప్రతిభను తెలిపే అకడమిక్ ఎక్స్‌పో


నమూనాల ప్రదర్శనలో విద్యార్థులు

జమ్మలమడుగు రూరల్ : డాది పాటు అభ్యసించిన ప్రతిభను తెలిపేదే అకడమిక్ ఎక్స్ పో అని జీవన జ్యోతి విద్యాసంస్థల కరస్పాండెంట్ గురుదేవ్ రామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక టికెఆర్ జీవన జ్యోతి పాఠశాలలో సోమవారం అకడమిక్ ఎక్స్ పో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో పిల్లలకు నేర్పిన విద్యను మళ్లీ వివిధ రకాల నమూనాలతో తమ ప్రతిభను చూపించేలా చేసిన కార్యక్రమమే ఈ అక్కడమిక్ ఎక్స్ పో అన్నారు. అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఈవెంట్ పిల్లవాడు అద్భుతంగా చేశారన్నారు. సైన్స్‌పై మక్కువతోనే ఇలా చేయగలరన్నారు. ప్రధానోపాధ్యాయులు డి.గురుశేఖర్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టులో ఈవెంట్ చేశారన్నారు. వచ్చిన తల్లిదండ్రులకు పాఠశాల తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్మ, సుఖ వ్యాధులకు ఆధునిక వైద్యం


పరికరాలను ప్రారంభిస్తున్న సురేష్‌బాబు

కడప అర్బన్: ఫాతిమా వైద్య కళాశాల, ఆసుపత్రిలో చర్మ, సుఖ వ్యాధులకు ఆధునిక వైద్యం అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని మేయర్ సురేష్ బాబు అన్నారు. సోమవారం నూతన వైద్య చికిత్స పరికరాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరం పైన ఉన్న అవాంఛిత రోమాలు, ముఖంపై ముడతలు, పులిపిర్లు, మొటిమల వల్ల ఏర్పడిన మచ్చలు, రంధ్రాలు మైక్రో ధర్మ పరికరంతో చికిత్స చేసి శాశ్వతంగా తొలగిస్తారని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం జవ్వద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గిరిధర్, డైరెక్టర్ జయరామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహమ్మద్ సల్మాన్, సూపరింటెండెంట్ డాక్టర్ ఓబులేసు, వైస్ ప్రిన్సిపాల్ రామ మనోహర్ పాల్గొన్నారు.


ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

యువతకు స్ఫూర్తి చంద్రశేఖర్ ఆజాద్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నేటి యువతకు స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తి అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం డివైఎఫ్ఐ అధ్వర్యంలో స్థానిక ఎన్‌జిఒ కార్యా లయంలో కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ పూర్తి పేరు చంద్రశేఖర్ సీతారాం తివారీ అని తెలిపారు. స్వాతంత్ర్య కాంక్ష కోసం ఆయన పేరు చివర ఆజాద్ అని పెట్టుకున్న మహానుభావుడన్నారు. ఆజాద్ అంటే స్వేచ్ఛ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ సహచరుడని పేర్కొన్నారు. నేడు బిజెపి ప్రభుత్వం స్వాతంత్ర్య సమర యోధులకు తగిన గౌరవం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవడం కోసం, యువతకు ఉద్యోగాల కల్పన కోసం భవిష్యత్ పోరాటాల్లో కలసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులు సుభాష్, రాఘవ, సతీష్, సాయి పాల్గొన్నారు.

'సీమ' గురించి మాట్లాడే నైతిక హక్కు టిడిపికి లేదు

- రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాయలసీమ గురించి మాట్లాడే నైతిక హక్కు టిడిపికిలేదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షం టిడిపి రాయలసీమ కోసం ఈ మూడున్నర ఏళ్లలో ఎక్కడ ప్రశ్నించారని, ఎక్కడ ఉద్యమాలు చేశారని విమర్శించారు. మూడు రోజులుగా కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పాదయాత్ర కర్నూలు జిల్లాలో కొనసాగుతున్న విషయం ప్రధాన పత్రికల్లో వస్తున్నా చూడనట్లు నటిస్తున్నారన్నారు. రాయలసీమలో హైకోర్టు రాజధాని, కెఆర్ఎంబి కార్యాలయం రాయలసీమలో ఏర్పాటు కోసం చేసిన ఉద్యమాలు, ప్రయత్నాలు గమనించకపోవడం శోచనీయమన్నారు. గతంలో టిడిపి హాయంలో 69జిఒ తెచ్చి శ్రీశైలంలో రాయలసీమ నీటి హక్కులు శాశ్వితంగా సమాధి చేశారన్నారు. 120జిఒ ద్వారా రాయలసీమ వైద్య విద్యార్థినులకు అన్యాయం చేసిన వారెవరో లింగారెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధాని రాయలసీమ హక్కు అయినా కూడా అమరావతికి తరలించింది.. ఎయిమ్స్ హాస్పిటల్‌ను మంగళగిరికి తరలించింది ఎవరో చెప్పాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. చరిత్ర తుడిచేస్తే చెరగదని తెలిపారు. రాయలసీమ ఉద్యమకారులు మాత్రమే రాయలసీమ కోసం పని చేస్తారని తెలిపారు. పార్టీలకు అతీతంగా రాయలసీమ కోసం పని చేస్తూనే ఉంటామన్నారు. ఒక పార్టీ కొమ్ముకాసే ప్రసక్తేలేదని ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు.

'గడప గడపకూ' విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వైసిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడఒకూ మన ప్రభుత్వం అనే కార్యక్రమం నియోజకవర్గంలో సోమవారం నాటికి సంపూర్ణంగా విజయవంతమైందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 213 రోజులు తిరిగి 93వేల గృహాలను పలకరించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొట్టమొదటిగా పూర్తి చేసుకున్న నియోజకవర్గం ప్రొద్దుటూరు అన్నారు. నియోజకవర్గంలోని రెండు మండ లాలు, పట్టణంలోని 41 వార్డులు, 30 గ్రామ పంచాయతీలు, 49 గ్రామాలు పర్యటించినట్లు తెలిపారు. పట్టణంలో చెప్పుకోదగ్గ సమస్యలు తన దృష్టికి రాలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మురుగునీటి కాలువలు ప్రధాన సమస్యగా తెలిపారన్నారు. రెండవది విద్యుత్ సమస్య అన్నారు. కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి జగన్‌కు తెలియజేస్తానన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఏప్రిల్ మొదటి వారం నుండి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్ఫూర్తితో 'జగనన్న పల్లె ప్రగతి' కార్యక్రమాన్ని తన వ్యక్తిగతంగా నియోజకవర్గంలో ప్రారంభిస్తానన్నారు. ఆ సందర్భంగా గుర్తించిన అభివృద్ధి పనులకు అంచనాలు తయారు చేస్తామన్నారు. మే, జూన్ నెలల్లో ముఖ్యమంత్రి ద్వారా నిధులు మంజూరు చేయించుకొని, పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే వివరించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి